క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం: భీమిలిలోని కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీ నారాయణ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శ్రీవారికి ప్రత్యేక పూజ, హోమం జరిగాయి. అనంతరం జరిగిన వ్రతానికి పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా పాడుగుపాలెం, చందక, వెంకటాపురం, గొట్టిపల్లి, కుసులవాడ, గిడిజాల, బాకూరుపాలెం, మిందివానిపాలెం, గుమ్మడివానిపాలెం గ్రామాలకు పైన తెలిపిన సమయంలో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు పెయింటింగ్, ఆర్ట్ పోటీలు

కొమ్మాది: గిరిజన స్వాభిమాన ఉత్సవాలు–2025 లో భాగంగా రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ (టీసీఆర్‌టీఎం) ప్రాంగణంలో గిరిజన విద్యార్థులకు, గిరిజన కళాకారులకు పెయింటింగ్, ఆర్ట్ పోటీలను నిర్వహించనున్నట్లు టీసీఆర్‌టీఎం ఈడీ డా.రాణి మందా ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలియజేశారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో కండక్టర్‌కు రజత పతకాలు



పతకాలు అందుకుంటున్న రాంబాబు

పద్మనాభం: అథ్లెటిక్స్‌లో పద్మనాభం మండలం అనంతవరం గ్రామానికి చెందిన కె.రాంబాబు ప్రతిభ కనబరిచారు. బెంగళూరులో ఈ నెల నాల్గో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించిన 45వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో రెండు రజత పతకాలు సాధించారు. 100, 400 మీటర్ల పరుగు పందెంలో ఈ మెడల్స్ లభించాయి. ఆర్టీసీ కండక్టర్‌గా చేస్తున్న రాంబాబు అథ్లెటిక్స్‌లోనూ రాణించడంతో పలువురు ఆయన్ను అభినందించారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయం వద్ద బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి మండలంలోని పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ముస్లిం కాలనీ.. సమస్యలే అన్నీ..



ముస్లిం కాలనీలో ఇరుకు రోడ్లు

అభివృద్ధికి నోచుకోని కాలనీ

తాగునీటికీ తప్పని ఇక్కట్లు

20 ఏళ్లుగా ఇళ్ల పట్టాల కోసం పోరాటం

ఇరుకు రోడ్లతో రాకపోకలకు అవస్థలు

పీఎం పాలెం: కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడిచినా అభివృద్ధి జాడే లేని కాలనీ అది. చిన్నపాటి స్థలాల్లో షెడ్లు వేసుకుని సుమారు 120 ముస్లిం కుటుంబాలు కాలం గడిపేస్తున్నాయి. ప్రణాళికా లోపమో ఏమో గానీ ఇరుకు ఇళ్లలో .. కాలనీలోకి ప్రవేశించేందుకు అనువైన రహదారి కూడా లేక ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ ఆరో వార్డు పరిధి పీఎం పాలెం ముస్లిం కాలనీ దుస్థితి ఇది..

ఇదీ పరిస్థితి..

నగరంలోని నిరుపేద కుటుంబాలకు ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో సుమారు 20 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం సుమారు 120 ముస్లిం కుటుంబాలకు ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇచ్చింది. తమకు కేటాయించిన చిన్నపాటి స్థలాల్లోనే షెడ్లు నిర్మించుకుని ఆ కుటుంబాలు నివసిస్తున్నాయి. కంబాలకొండ ఫారెస్ట్ రక్షణ గోడకు చేరువగా మూడు వరుసలలో కాలనీ నిర్మించుకున్నారు. నిర్మాణ దశలో పట్టణ ప్లానింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇరుకు ఇరుకుగా ఇళ్లు నిర్మించుకోవలసి వచ్చింది. కాలనీలోకి ప్రవేశించడానికి అనుకూలంగా రహదారి సదుపాయం కూడా లేదు. కాలనీలో అనుకోని ప్రమాదాలు ఏం జరిగినా అంబులెన్స్, అగ్నిమాపక శకటం వంటి ఏ వాహనాలు వెళ్లే అవకాశమే లేదు. కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే ప్రయాణించేంత ఇరుకు సందులు.



కాలనీకి వెళ్లే రోడ్డులోని మురుగు కాలువ

మౌలిక సదుపాయాలు అంతంత మాత్రమే..

- కాలనీలో నామమాత్రంగా నిర్మించిన చిన్నపాటి డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మరికొన్ని పూడుకుపోయాయి.
- వంద అడుగుల ప్రధాన రహదారి నుంచి కాలనీకి వెళ్లే 60 అడుగుల రహదారి కనీసం అభివృద్ధికి నోచుకోలేదు. ఈ కారణంగా రాత్రి వేళల్లో కాలనీలోకి వెళ్లాలంటే ఇబ్బంది పడవలసి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో నీటికి ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో ట్యాంకుల ద్వారా అదనంగా తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.



శిథిలమైన డ్రైనేజీ

నేటికీ అందని ఇళ్ల పట్టాలు

కాలనీ ఏర్పడి 20 ఏళ్లు దాటిపోయినా నివాసితులకు ఇప్పటికీ ఇళ్ల పట్టాలు లేవు. కాలనీ ఏర్పాటు సమయంలో కనీస టౌన్‌ప్లానింగ్ నిబంధనలు పాటించకపోవడమే పట్టాల మంజూరుకు అడ్డంకిగా మారిందని అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దయ చూపి, తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



ముస్లిం కాలనీకి వసతులు కల్పించాలి. ముఖ్యంగా రోడ్డు నిర్మించాలి. పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే ప్రధాన రహదారి నుంచి ముస్లిం కాలనీకి వెళ్లే 60 అడుగుల రోడ్డును అభివృద్ధి చేయాలి. తాగునీటికి కూడా ఇబ్బందిగా ఉంది. ఇప్పుడు విడుదల చేస్తున్న నీటితో పాటు అదనంగా ట్యాంకుల ద్వారా సరఫరా చేయాలి. – ఎం. కుమార్, పీఎం పాలెం

పట్టాల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం



కాలనీ ఏర్పాటు చేసి 20 ఏళ్లు పూర్తయింది. ఇప్పటివరకు మాకెవరికీ ఇళ్ల పట్టాలివ్వలేదు. ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నాం. అర్జీలు సమర్పిస్తున్నాం. అయినా, కనీసం స్పందించడం లేదు. ప్రభుత్వం, అధికారులు మా గోడు పట్టించుకోవాలి. మా కాలనీవాసులకు పట్టాలు మంజూరు చేయాలి.

– ఎస్‌కే. హుస్సేన్, ముస్లిం కాలనీ

యువత పోరును విజయవంతం చేయండి

వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



తగరపువలస: విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలిచి, చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం తలపెట్టిన యువత పోరును భీమిలి నియోజకవర్గ ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొత్త నోటిఫికేషన్లు లేక, నిరుద్యోగ భృతి అందక యువశక్తి నిర్వీర్యం అవుతోందన్నారు. మరో వైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థల వేధింపులకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బలవుతున్నారన్నారు. వీటిపై తమ వాణిని వినిపించేందుకు ఎక్కువ సంఖ్యలో హాజరు కావాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి యువత, విద్యార్థులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు నగరంలోని జిల్లా పరిషత్ కూడలికి ఉదయం 9 గంటలకు చేరుకోవాలని కోరారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్రగా వెళ్లి వినతిపత్రం అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్టు తెలియజేశారు.

ఘనంగా పరదేశమ్మ రథాల ఉత్సవం



పాట్నూరులో అరటిపళ్ల రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని పాట్నూరులో పరదేశమ్మ రథాల ఉత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. వ్యవసాయ బళ్లను ఐదు రథాలుగా తీర్చిదిద్ది, గ్రామం ప్రవేశం నుంచి చివరి వరకు మూడుసార్లు తిప్పారు. వీటిలో అరటిపళ్ల రథం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చిడతలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయం, పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

పోలీస్ సిబ్బందికి ముగిసిన ఏఆర్‌సీ శిక్షణ



మాట్లాడుతున్న అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని ఏపీఎస్‌పీ 16వ పోలీస్ బెటాలియన్‌లో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న మూడో బ్యాచ్ యాన్యువల్ రిఫ్రెషర్ కోర్సు శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన 60 మంది పోలీస్ సిబ్బందికి వెపన్స్ వినియోగం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది కుటుంబాల సభ్యులకు వెన్నంటి ఉండే విధంగా ఐజీ ఆదేశాల మేరకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ కమాండెంట్లు ఎస్.మురళీధర్, వి.నారాయణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశికాంత్ తదితరులు హాజరయ్యారు.

చెత్త నుంచి సంపద దిశగా అభివృద్ధి



డంపింగ్ యార్డులో మొక్క నాటుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

మధురవాడ: చెత్త నుంచి సంపద తయారు చేసే దిశగా విశాఖను అభివృద్ధి పరచాలని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సూచించారు. మధురవాడ జోన్‌లోని కాపులుప్పాడ డంపింగ్ యార్డును అధికారులతో కలసి మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ జిందాల్ పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఇక్కడ కార్యకలాపాలు, విద్యుత్ ఉత్పత్తి తదితర విషయాలను సంస్థ ప్రతినిధుల ద్వారా తెలుసుకున్నారు. బయోమైనింగ్ యార్డులో సుమారు 8 ఎకరాల్లో 4000 పండ్ల మొక్కలతో ప్రారంభించిన స్థలంలో మొక్కలు నాటారు. కాలుష్య నివారణలో రాష్ట్రానికి ఆదర్శంగా ఈ బయోమైనింగ్ యార్డు గ్రీన్ స్పేస్ నిలిచిందని ప్రశంసించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ అర్జునరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గురు అమ్మవార్ల అనుపోత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్లు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

తగరపువలస: సంగివలస ముగ్గురు అమ్మవార్ల (కొత్తమ్మ) ఆలయ వార్షికోత్సవం కనులపండువగా జరిగింది. వేడుకల్లో భాగంగా మంగళవారం పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్ల అనుపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాణసంచా, కోటపాడుకు చెందిన కళాకారుల కోలాటం, పాలకొండకు చెందిన నవదుర్గ అమ్మవార్ల ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఆలయాన్ని పూలమాలలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఏర్పాట్లు పర్యవేక్షించారు. పౌరాణిక నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో స్టేజ్‌పై హనుమంతువాకకు చెందిన కళాకారిణి శ్రేయ శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయం ముందు సర్వీస్‌రోడ్డులో ట్రాఫిక్‌ను భీమిలి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరించారు.

హంస వాహనంపై అనంతుడు



ఉభయ దేవేరులతో అనంత పద్మనాభ స్వామిని హంస వాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం

పద్మనాభం: అనంత పద్మనాభస్వామి ఉభయ దేవేరులతో హంస వాహనంపై కొలువుదీరారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారిని మంగళవారం రాత్రి ఘనంగా ఊరేగించారు. పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా విశేష హోమం, గ్రామ బలిహరణం నిర్వహించారు. అనంతరం తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

నేడు తెప్పోత్సవం

కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పద్మనాభం జంక్షన్‌లోని పుష్కరిణిలో అనంత పద్మనాభ స్వామి తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కంటుబోతు రాంబాబు మంగళవారం రాత్రి ఏర్పాట్లు పరిశీలించారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

- ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖరరావు
- కేజీబీవీలో ఇంటర్ విద్యార్థులకు ఫిజిక్స్ బోధన



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ఏపీసీ చంద్రశేఖరరావు



ఇంటర్ విద్యార్థినులకు ఫిజిక్స్ బోధిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖరరావు

పద్మనాభం: పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జె.చంద్రశేఖరరావు విద్యార్థులకు సూచించారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్, పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఏకాగ్రతతో చదవాలని సూచించారు. ఒత్తిడిని అధిగమిస్తే విజయం సొంతమవుతుందన్నారు. ఇంటర్ విద్యార్థులకు ఫిజిక్స్ పరీక్ష రాయడానికి సులభమైన రీతిలో అంశాలను వివరించారు. కసూర్బా విద్యార్థినులకు తరచూ వైద్యపరీక్షలు నిర్వహించాలని, ఆరోగ్య సమస్యలుంటే వైద్యం చేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

16న వరకవి సన్యాసిదాసు వర్ధంతి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు శ్రీకుసుమ హరనాథ సంతపేటలో ఈ నెల 16న వరకవి సింగారపు సన్యాసిదాసు 23వ వర్ధంతి నిర్వహిస్తున్నట్టు అద్వైత అమృత భజన బృందం తెలియజేసింది. ఉదయం 8 గంటలకు గురుపూజ నిర్వహించిన అనంతరం బృందాలతో భారీ బైటో భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు డోలకిస్ట్ రవ్వ ఆనంద్ తెలిపారు. వివరాలకు 95052 73236, 77319 76289 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు 150వ సంవత్సరంలోకి ఏబీ చర్చి



ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి

భీమునిపట్నం: భీమిలిలోని చారిత్రక ఆంధ్రబాప్టిస్ట్ చర్చి 150 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా బుధవారం చర్చి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చర్చి ప్రతినిధులు తెలిపారు. 1875లో పయనీర్ మిషనరీస్ ఆధ్వర్యంలో డాక్టర్ రెవరెండ్ ఆర్.శ్యాంఫోర్డ్, మిసెస్ ఎల్.ఎం.శ్యాంఫోర్డ్ భీమిలి సమీపంలోని వలందభూములు గ్రామం వద్ద తమ సొంత భవనంలో ఈ చర్చిని ఏర్పాటు చేశారు. కీతిస్‌పేట వద్ద బ్రిటిష్ వారు ప్రార్థనలు చేసుకునేందుకు సెయింట్ పీటర్స్ చర్చి నిర్మించడంతో తెలుగువారు ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిని ఏర్పాటు చేశారు. తరువాత భీమిలి బ్యాంక్ రోడ్డులో చర్చి నిర్మాణం ప్రారంభం కాగా, 1887 సెప్టెంబర్ 14న కొత్త చర్చి ప్రారంభమైంది. అప్పటి నుంచి చుట్టు పక్కల వారందరూ ప్రార్థనలు, పండగలు నిర్వహిస్తున్నారు. చర్చి సంఘం ఆధ్వర్యంలో దీని నిర్వహణ జరుగుతోంది. చర్చి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలతో పాటు సువార్త సభలు, ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సంఘ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి పి.ఎస్.చంద్ ఇతర సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

41 ఏళ్లుగా మంచానికే పరిమితం

- పింఛన్ పునఃపరిశీలనకు వెళ్లలేని దైన్యం
- ఆ డబ్బులే జీవనాధారం



లేవలేని స్థితిలో సత్తిబాబు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు కొత్తపేటకు చెందిన మానసిక దివ్యాంగుడు పల్లా సత్తిబాబుకు 41 ఏళ్లు. ఇప్పటి వరకు గడపదాటి బయటకు వెళ్లడం ఎరుగడు. అతడి బాగోగులు చూసుకునేందుకు నిత్యం ఒకరు ఉండాలి. ఆకలి కూడా తెలియని సత్తిబాబుకు సమయానికి భోజనం పెట్టి, మల మూత్రాదులకు తీసుకువెళ్లాలి. కూర్చున్న చోటే, నిలబడిన చోటే మలమూత్ర విసర్జన చేస్తే అప్పటికప్పుడు శుభ్రం చేయాలి. రెండేళ్ల క్రితం వరకు ఉన్న అతని తల్లి రామయ్యమ్మ సత్తిబాబును కంటికి రెప్పలా చూసుకునేది. వృద్ధాప్యం కారణంగా ఆమె మరణించింది. అప్పటి నుంచి సత్తిబాబు సోదరుడు శ్రీనివాస్ తమ్ముడి బాగోగులు చూసుకుంటున్నాడు. అనుక్షణం తమ్ముడికి కాపలాగా ఉండాల్సి రావడంతో శ్రీనివాస్‌కు బయటకు వెళ్లడం కూడా కష్టమవుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో కేటరింగ్ పనులకు వెళ్తాడు, ఆ కొద్ది సమయం మాత్రం పక్కింట్లో ఉండే సోదమ్మకు తమ్ముడి భోజనం బాధ్యతలు అప్పగించి వెళ్తాడు. సత్తిబాబును చూడడం ఇష్టం లేని తన భార్య తమ నుంచి విడిపోయిందని శ్రీనివాస్ తెలిపాడు.

పింఛన్ పునః పరిశీలనకు రావాలని నోటీసు

దివ్యాంగుల పింఛను పథకం పరిశీలనలో భాగంగా ఈ నెల 7న విశాఖలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు హాజరుకావాలని బొగ్గురోడ్డు సచివాలయ సిబ్బంది నోటీసు జారీ చేశారు. రాకుంటే పింఛన్ రద్దు చేస్తారని నోటీసులో పేర్కొన్నారు. తరలించడానికి కూడా వీలుపడని తన తమ్ముడిని హాస్పిటల్‌కు తీసుకువెళ్లలేకపోయానని, పింఛన్ రద్దు చేస్తే ఏం చేయాలో పాలుపోవడం లేదని శ్రీనివాస్ వాపోతున్నాడు.

గతంలో ఇంటికి వచ్చి పరీక్షించేవారు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, వైద్యులు ఇంటికి వచ్చే పరీక్షలు చేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రికి తీసుకురమ్మంటుంది. ప్రస్తుతం మా తమ్ముడిని ఎక్కడికీ కదిలించలేని పరిస్థితి. అధికారులు దయ చూపాలి.

– పల్లా శ్రీనివాస్, కొత్తపేట

జాతరలతో అనుబంధాలు దృఢం



కనకదుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న చిన్న శ్రీను

కొమ్మాది: అందరూ కలసికట్టుగా జాతరలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్న శ్రీను అన్నారు. పల్లెల్లో జాతరలతో అనుబంధాలు మరింత దృఢంగా మారతాయన్నారు. స్థానిక సాయిరాం కాలనీలో శ్రీ కనకదుర్గాంబిక అమ్మవారి 23వ జాతర మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. అమ్మవారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనకదుర్గమ్మ దయతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, నగరాల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, ముందుండి రాజేశ్వరి, చేకూరి రజని, మురళి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.